ధాన్యం దళారుల పాలు

- కొనుగోలు ప్రారంభం కాని వైనం
- అకాల వర్షంతో ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు


ధర్మసాగర్‌లో కొనుగోలు కేంద్రం వద్ద దళారులకు వడ్లు విక్రయిస్తున్న రైతులు

నర్సాపూర్: ఆరునెలల పాటు కష్టపడి పండించిన ధాన్యం దళారుల పాలు అవుతోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పది రోజులవుతున్నా.. ఎక్కడా కాంటా పెట్టలేరు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తెచ్చి ఆరపెడుతూ.. తూకం కోసం ఎదురు చేస్తున్నారు. నర్సాపూర్ మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(ప్యాక్స్) ఆధ్వర్యంలో 17 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 15 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా.. వాటిని ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, ఐకేపీ అధికారులతో కలిసి వారం క్రితం కొన్నింటిని పది రోజుల క్రితం కొన్నింటిని ప్రారంభించారు. కాగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పది శాతం బ్యాంకు గ్యారంటీ ఇవ్వడానికి రైసుమిల్లర్లు నిరాకరించడంతో ఇంకా కొనుగోలు కేంద్రాలకు రైసు మిల్లుల కేటాయింపులు జరగనందున కేంద్రాల్లో వడ్ల తూకం పనులు ప్రారంభించడం లేదు.

పేరుకుపోతున్న ధాన్యం

మండలంలో ప్యాక్స్, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 32 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్ల తూకం ప్రారంభించనందున అన్ని కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పేరుకుపోతున్నాయి. ఇప్పటికే మండలంలోని కేంద్రాల్లో సుమారు 50 లారీల ధాన్యం బస్తాలు పేరుకుపోయాయి.

టార్పాలిన్లు సరిపడా లేవు

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి.. మొక్కుబడిగా టార్పాలిన్లు సరఫరా చేసింది. ఒక్కో కేంద్రానికి ఆరు టార్పాలిన్లు ఇవ్వడంతో అవి సరిపోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. రైతులు టార్పాలిన్లు అద్దెకు తెచ్చుకోవడంతో తమపై అదనపు భారం పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైసుమిల్లులు కేటాయించలేదు

ధాన్యం ఎందుకు తూకం వేయడం లేదని ప్యాక్స్ సీఈఓ వెంకటస్వామి, ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్‌లను వివరణ కోరగా.. తమకు రైసుమిల్లులను కేటాయిస్తూ ఉన్నతాధికారుల నుంచి సమాచారం రాలేదన్నారు. తూకం వేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే తూకం వేస్తామన్నారు.


నర్సాపూర్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరపెడుతున్న రైతులు


కౌడిపల్లి(నర్సాపూర్): పేరుకుపోయిన వరిధాన్యం రాశులు

ఇష్టం లేకున్న నష్టానికి దళారులకే విక్రయిస్తున్న రైతులు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా.. ఇంకా తూకం వేయడంలేదు. దీంతో అకాల వర్షాలతో దిగులు పడుతూ రైతులు దళారులకు ధాన్యం విక్రయిస్తున్నారు. మండలంలో బోరుబావులు, చెరువు కుంటల కింద ఈ వానకాలంలో 18,500 ఎకరాల్లో రైతులు సన్న, దొడ్డురకం వరిధాన్యం పండించారు. రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేదుకు ఏ-గ్రేడ్ వరిధాన్యానికి రూ. 2320, సాధరణ గ్రేడ్‌కు రూ. 2300 ధర కల్పించింది. మండలంలోని వివిధ గ్రామాల్లో గత వారం ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 26 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ తూకం ప్రారంభించలేదు. దీంతో రైతులు దళారులకు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు ప్రారంభించకపోవడంతో దళారులు ఇష్టారాజ్యంగా మారింది. క్వింటాల్‌కు రూ. 1900 నుంచి రూ. 2100 వరకు కొనుగోలు చేస్తూ ఎనిమిది కిలోల వడ్లు తరుగు తీస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వడ్లు త్వరగా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎనిమిది రోజులైనా.. తూకం వేయలేదు



భూమిని కౌలుకు తీసుకొని వరి పండించిన. నాకు పండిన ఆరు ట్రాక్టర్ల వడ్లను నర్సాపూర్‌లోని కొనుగోలు కేంద్రానికి వారం రోజుల క్రితం తెచ్చాను. వడ్లు తేమ లేకుండా బాగా ఎండ పెట్టినా.. ఇంత వరకు తూకం వేయడం లేదు. మొన్న కురిసిన వర్షానికి వడ్లు తడవడంతో మళ్లీ ఎండపెడుతున్న.

– భిక్షపతి, రైతు, నారాయణపూర్

చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరి అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి,మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు.

తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. ఉదయం దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా కమిషనర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు చేసి, బోనాలు సమర్పించి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు తలనీలాలు సమర్పించి, వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు.


తునికి నల్లపోచమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

సికింద్లాపూర్‌లో..

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో కొలువైన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కోనేరు పక్కనున్న లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకోవడంతో పాటు గుట్టపైన కొలువైన స్వామివారిని కాలినడకన వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారిలు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ శశిధర్ తెలిపారు.

మెస్ చార్జీలు పెంచడం హర్షణీయం


ఫ్లకార్డులతో ధన్యవాదాలు తెలుపుతున్న విద్యార్థులు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు

నర్సాపూర్: రాష్ట్రంలోని గురుకుల హాస్టళ్లలో ఉండే విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం హర్షణీయమని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రవి అన్నారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గురుకులాల మెస్ చార్జీలు 2017 నుంచి పెరగక పోవడంతో పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో ప్రభుత్వం నిర్ణయించిన మెను అమలు చేయడం కోసం చాలా ఇబ్బంది పడ్డామని చెప్పారు. ప్రస్తుతం మెను చార్జీలు పెంచడంపై సీఎం రేవంత్ రెడ్డికి తన పాఠశాలల తరపున ప్రిన్సిపాల్ రవి, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇండోర్ స్టేడియం నిర్మించాలి

నర్సాపూర్: పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మించాలని బ్యాడ్మింటన్ క్రీడాకారులు కోరారు. పట్టణానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు, క్రీడాకారులు ప్రతీ రోజూ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో బ్యాడ్మింటన్ ఆడుతున్నారు. వారు ఇటీవల ఫ్రెండ్లీ బ్యాడ్మింటన్ లీగ్ పోటీలు నిర్వహించి, ఆదివారం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ.. పట్టణంలో ఇండోర్ స్టేడియం లేనందున తమలాంటి క్రీడాకారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, క్రీడాకారుల అవసరాన్ని గుర్తించి ఇండోర్ స్టేడియం నిర్మించాలని అన్నారు. పోటీల్లో విజేతలు శంకర్, ప్రసాద్ జట్టుతో పాటు భాస్కర్, రవి జట్లకు ప్రథమ, ద్వితీయ బహుమతులను స్థానిక క్రీడాకారుడు నర్సింగ్‌రావు అందజేశారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు గణేశ్, రవి, అప్పలనాయుడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


బహుమతులు పొందిన విజేతలతో క్రీడాకారులు

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

నర్సాపూర్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి వైద్యులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని వార్డుల్లో తిరిగి రోగులతో మాట్లాడారు. వైద్యం ఎలా అందుతుందని, అవసరమైన మందులు ఇస్తున్నారా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. కాగా దోమలు ఎక్కువగా వస్తున్నాయని పలువురు రోగులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అనంతరం సోమవారం ప్రారంభించనున్న డయాలసిస్ సెంటర్ కోసం కేటాయించిన గదులోకి అక్కడి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు అన్ని మందులు ఇవ్వాలని, దోమలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి విధుల్లో ఉన్న వైద్యులు డాక్టర్ రాముకు సూచించారు. ఆమె వెంట పలువురు నాయకులు ఉన్నారు.


నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

మహిళ అదృశ్యం

మెదక్ మున్సిపాలిటీ: మహిళ అదృశ్యమైన సంఘటన మెదక్ పట్టణంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కోలిగడ్డ వీధికి చెందిన 56 ఏళ్ల వయస్సు గల మ్యాకల లక్ష్మి ఈ నెల 2న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయినట్లు తెలిపారు. ఆమె భర్త మ్యాకల సిద్ధయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు మెదక్ పట్టణ పోలీసులకు (87126 57913, 92916 65443) సమాచారం ఇవ్వాలని తెలిపారు.


లక్ష్మి(ఫైల్)

సమగ్ర కులగణన కాంగ్రెస్‌తోనే సాధ్యం

పెద్దశంకరంపేట(మెదక్): సమగ్ర కులగణన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాయిని మధుసూదన్ అన్నారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా రాజకీయంగా బీసీలకు అవకాశాలు పెరుగుతాయని, ఆర్థిక సర్వేతో ఉపాధి కల్పనకు ప్రణాళిక ఏర్పడుతుందని, బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అవకాశాలు పెరుగుతాయన్నారు. తెలంగాణలో అన్ని వర్గాలకు సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేస్తారన్నారు. ప్రభుత్వ పథకాలను కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ప్రతీ గడపకు చేరవేయాలన్నారు.

విరాళం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చండిలో కొలువైన చండికాంబ ఆలయ అభివృద్ధికి మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా ఆలయ నిర్వాహకులకు రూ. 10 వేల విరాళం ఇచ్చారు. క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ కోసం క్రీడాకారులకు రూ.15 వేల నగదు అందజేశారు. యువత వారికి నచ్చిన క్రీడాల్లో రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ముత్యంరెడ్డి, ఎల్లం, వెంకట్‌రెడ్డి, కృష్ణరెడ్డి, రాంచెందర్, వినోద్, సురేష్, లక్ష్మీకాంత్, తదితరులు ఉన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి


శివ్వంపేట(నర్సాపూర్): ఉసిరికపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శివ్వంపేట(నర్సాపూర్): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆదివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో దంతన్‌పల్లి, కొంతన్‌పల్లి, పోతులబోగూడ, ఉసిరికపల్లి, పిల్లుట్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల కన్న ముందు కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు కల్లూరి హరికృష్ణ, చంద్రగౌడ్, మన్సూర్, కృష్ణారావు, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, విరేష్, చింత స్వామి, తదితరులు ఉన్నారు.

పరామర్శ

నర్సాపూర్: పట్టణంలోని ఓ బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆదివారం పరామర్శించారు. పట్టణానికి చెందిన పంబల్ల కిష్టయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. దీంతో ఆయన కుటుంబీకులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్లు పంబల్ల లలిత, సరిత, బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, పంబల్ల భిక్షపతి, సూరారం నర్సింలు, రింగుల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో మధ్యాహ్నం సర్వే వద్దు

- పీఎస్‌హెచ్‌ఎంల రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలయ్య

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో మధ్యాహ్నం సర్వే చేయ్యొద్దని ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలయ్య కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉదయం పూట సర్వే చేయడమే అనుకూలమని, ప్రభుత్వం మాత్రం మధ్యాహ్నం సర్వే చేయమంటుందన్నారు. మధ్యాహ్నం గ్రామాల్లో ఇంటి వద్ద ఉండేవారి సంఖ్య తక్కువన్నారు. ప్రభుత్వం పునరాలోచించి ఒకే రోజు సమగ్ర సర్వేను పూర్తిచేసే తరహాలోనే కులగణన సర్వే కూడా చేసేందుకు నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఇలా ఒకే రోజు సర్వేతో ప్రజలకు అనుకూలం, పాఠశాలల మూత ఉండదని గుర్తించాలన్నారు. పీఎస్‌హెచ్‌ఎంలను ఎన్యూమరేటర్ల సూపర్‌వైజర్‌గా బాధ్యతలు అప్పగించాలని తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు సీజ్

- 10 మందిపై కేసు నమోదు

తూప్రాన్: అక్రమంగా రాత్రివేళల్లో మట్టిని తరలిస్తున్న ఐదు టిప్పర్లు, హిటాచి యంత్రం సీజ్ చేసి, 10 మంది నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం అన్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లి శివారులోని ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా రాత్రివేళల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న సమాచారం అందిందన్నారు. తమ సిబ్బందితో ఆదివారం తెల్లవారుజామున సంఘటన స్థలానికి చేరుకొని ఐదు టిప్పర్లు, హిటాచి యంత్రాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఇందుకు కారకులైన 10 మంది అక్రమార్కులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


సీజ్ చేసిన టిప్పర్లు, హిటాచి యంత్రం

దొంగ బాబాలను నమ్మొద్దు

చిలప్‌చెడ్(నర్సాపూర్): విజ్ఞానంతో మూఢనమ్మకాల నిర్మూలన సాధ్యమని, దొంగ బాబాలను నమ్మకూడదని ఎస్‌ఐ యాదగిరి, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్ అన్నారు. ఆదివారం ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని చిట్కుల్ కస్తూర్బా బాలికల పాఠశాలలో వ్యక్తిత్వ వికాసం, సైన్స్, మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్‌ఐ యాదగిరి, నరేశ్ హాజరై మాట్లాడుతూ.. సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. దొంగ స్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఆర్థికంగా మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా నరేశ్ మాంత్రికులు, భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైనన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వాటి రహస్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ మిస్బావుద్దీన్, పోలీస్ సిబ్బంది అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.


చిట్కుల్‌లో అవగాహన కల్పిస్తున్న నరేశ్

సంక్షిప్త వార్తలు

◆ **ప్రమాదకరంగా గుంతలు**

రేగోడ్(మెదక్): లక్షలు వెచ్చించినా.. రోడ్లకు నాణ్యతతో మరమ్మతులు చేయడం లేదు. ఫలితంగా మళ్లీ గుంతలు ఏర్పడి, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రం రేగోడ్‌లోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రోడ్డుపై గుంతలు పడ్డాయి. ఈ రోడ్డు గుండా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా.. మోడల్ స్కూల్ వాహనాలు, విద్యార్థులు గుంతలు పడిన రోడ్డు నుంచే వస్తుంటారు. గతంలో ఈ గుంతలకు మరమ్మతులు చేసినా.. మళ్లీ గుంతలు పడ్డాయి. మరమ్మతుల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు అవుతున్నా.. ఇలాంటివి మళ్లీ పునరావృత్తం అవుతున్నాయి. రోడ్డుపై పడిన గుంతలతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

◆ **ధాన్యం కొనుగోలు చేయకుంటే ధర్నా చేస్తాం**



చిన్నశంకరంపేట(మెదక్): రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు చేయకుంటే రోడ్డెక్కాల్సిన పరిస్థితి వస్తుందని నార్సింగి మండల మాజీ జెడ్పీటీసీ కృష్ణారెడ్డి హెచ్చరించారు. ఆదివారం నార్సింగి మండల కేంద్రంలో తడిసిన ధాన్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కొబ్బరికాయలు కొట్టి 20 రోజులవుతున్నా.. ఇప్పటికి ధాన్యం కాంటా పెట్టడంలేదన్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే రైతుల ధాన్యం కాంటా చేయాలన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బాబు, ప్రధాన కార్యదర్శి భూపతిరాజు, జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు**

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆదివారం నర్సాపూర్ క్యాంపు కార్యాలయంలో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆమె అందజేశారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని బాధితుడు వెంకటేశ్‌కు మాజీ ఎంపీపీ శ్రీనివాస్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వెంకటేశ్‌కు రూ.60 వేల మంజూరు కాగా సంబంధిత చెక్కును బాధిత కుటుంబీకులకు అందించినట్లు తెలిపారు.

ముగిసిన సీపీఐ(ఎం) జిల్లా మహాసభ

- జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

తూప్రాన్: డివిజన్ కేంద్రంలో రెండు రోజులుగా కొనసాగిన సీపీఐ(ఎం) మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా కే.నర్సమ్మ, కార్యదర్శివర్గ సభ్యులుగా మల్లేశం, బస్వరాజు, కే.మల్లేశం, మహేందర్‌రెడ్డి, బాలమణి, కార్యవర్గ సభ్యులుగా నాగరాజు, బాగయ్య, సంతోష్, ప్రవీణ్, మల్లేశం, అజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ మహాసభలకు రాష్ట్ర పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయలక్ష్మి హాజరయ్యారు. ఈ మహాసభల్లో, రైతులు, కార్మికులు, మహిళలు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, యువజనులు, జిల్లా అభివృద్ధి తదితర సమస్యలపై పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య, రమేశ్, అనిల్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నర్సమ్మ

క్లుప్తంగా

'సత్యసాయి' ఆధ్వర్యంలో వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు

పెద్దశంకరంపేట(మెదక్): భగవాన్ సత్యసాయి సేవా సంస్థ సంగారెడ్డి యువజన విభాగం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం స్థానిక మానిక్‌ప్రభు దేవాలయంలో భజన కార్యక్రమాలు, మాతృవందనం, నగర సంకీర్తన, పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజలకు వైద్య శిబిరాన్ని నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం గ్రామ పురవీధులగుండా పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థ బాధ్యులు మారుతీ పాటిల్, కుమ్మరి మల్లేశం, రాంచందర్, సాయితేజ తదితరులు ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్

పాపన్నపేట(మెదక్): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఏడుపాయల కమాన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టి, బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఇతరులకు హాని కలిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయడంపై హర్షం

మెదక్ మున్సిపాలిటీ: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయడంపై డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్లు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 121 డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న 460 డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్లకు మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మూడు నెలల పెండింగ్ వేతనాలు సుమారు రూ.8 కోట్ల 12 లక్షలు ఉన్నాయి. డిగ్రీ కళాశాల విద్య కమిషనర్ విడుదల చేసినట్లు కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా డిగ్రీ విద్యాశాఖ కమిషనర్, ఆర్జేడీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఉచిత డయాబెటిక్ పరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న లయన్స్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో ఆదివారం ఉచిత డయాబెటిస్ పరీక్షలు నిర్వహించారు. లయన్స్ 320డీ జిల్లా గవర్నర్ నగేశ్, జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి ఆదేశాల మేరకు ఉచిత డయాబెటిక్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చేగుంట లయన్స్ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. ఆదివారం క్యాంపులో 19 మందికి పరీక్షలు నిర్వహించగా.. కార్యదర్శి రాంచంద్రం, కోశాధికారి సతీశ్ పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం


పూర్వ విద్యార్థులు

తూప్రాన్: డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985–86 లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఒక చోట కలిశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దంతన్‌పల్లిలో పలువురు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే సునీతారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు నాగేశ్వర్‌రావు, దుర్గేశ్, రమేశ్, తదితరులు ఉన్నారు.